మండలాభివృద్ధికి సహకరించండి : ఎంపీపీ

విశాలాంధ్ర-పొన్నూరు: మండలాభివృద్ధికి అధికారులు అందరూ సహకరించాలని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులకు సహకరించటంతో పాటు ఎంపిక చేసిన వివిధ అభివృద్ధి పనులను త్వరతగతిగా పూర్తిచేసి మండలాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎండిఓ శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

35 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-మంగళగిరి : యర్రబాలెంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళగిరి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల మేరకు తాడేపల్లి ఎన్టీఆర్ కరకట్టకు చెందిన చిట్టిపోతుల జోజిబాబు కార్పొరేషన్ పరిధి యర్రబాలెంలో ఇంటింటా తిరిగి 35 బస్తాల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. అనంతరం ఆ బియ్యాన్ని ఆటోలో రేపల్లెకు తరలించేందుకు సిద్ధమయ్యాడు. పక్కా సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు గురువారం రాత్రి మెరుపు దాడి నిర్వహించి రేషన్ బియ్యం తరలిస్తున్న జోజిబాబును అదుపులోకి తీసుకున్నారు. ఆటోను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండల ప్రజాపరిషత్ అధ్యక్షునిగా చెన్నకేశవులు

విశాలాంధ్ర, తెనాలి : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షుని ఎంపిక జరిగింది. ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ ఆయన్ని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నేటి ప్రభుత్వం అన్ని వర్గాల వారికి ప్రాతినిధ్యం ఇస్తున్నారని, ఈ నేపథ్యంలో చెన్నకేశవులును ఎంపిక చేశారన్నారు. మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి ప్రజల ఆదరణ పొందాలన్నారు. ఎన్నిక అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ నందు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులలో సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ) గుంటూరు జిల్లా మహిళా విభాగం నేతలు కమిషనర్ కీర్తి చేకూరిని కోరారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్ నందు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. విదేశీ పర్యటన దిగ్విజయంగా ముగించుకుని వచ్చిన ఆమెకు అభినందనలు తెలియజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీ జీఈఎ గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, జిల్లా సంయుక్త కార్యదర్శి కోట సాహెబ్, నగరశాఖ సంయుక్త కార్యదర్శి ఎల్.భరత్‌కుమార్, గుంటూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఎల్.పద్మావతి, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్రాదేవి, జిల్లా కోశాధికారి టి.శేషుకుమారి, జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత కుమారి, సంధ్యారాణి, జిల్లా సంయుక్త కార్యదర్శి రమణి, అనిత తదితరులు ఉన్నారు.

గార్డెన్స్ గ్రంథాలయంలో ఆటల పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జాతీయ 56వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయం నందు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ ఆటల పోటీలు గ్రంథాలయ అధికారులు బి.శకుంతల, పి.సత్య శిరీష, ఎస్.విజయ్, పీఈటీ టీచర్‌ల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఎంసీపీఎస్ స్కూల్ నుంచి 16 మంది విద్యార్థినీ, విద్యార్థులు, అలాగే పీహెచ్‌ఎస్, ఎస్‌కెఎస్‌ఏపీఎస్ స్కూల్స్ 120 మంది విద్యార్థినీ, విద్యార్థినీలు ఈ ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీవీ గురవారెడ్డి, ఎస్‌కేఎస్‌ఏపీఎస్ స్కూల్ టీచర్ జి.శివారెడ్డి, ఎంసీపీఎస్ స్కూల్ టీచర్ ఎస్.ఈశ్వరి, పి.మనస్విని, సరిత, పీహెచ్‌ఎస్ స్కూల్ టీచర్ ఆర్.రత్నకుమారి, గ్రంథాలయ సిబ్బంది పి.కోటేశ్వరి, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి అభివృద్ధికి డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ లక్ష రూపాయలను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌కు శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ ఆమెను అభినందించారు. ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు లక్ష రూపాయలు అందచేసినట్లు చెప్పారు. అదేవిధంగా నర్సింగ్ సూపరింటెండెంట్ సమీనా కూడా రూ.85 వేలు విలువ గల పరికరాన్ని అందజేయడం అభినందనీయమని డాక్టర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరులో తెదేపా, జనసేన ఆందోళన

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. ర్యాలీలో తెదేపాతో పాటు జనసేన కలిసి పట్టణంలోని జీబీసీ రోడ్డు అభివృద్ధి విస్తరణ పేరుతో భవన సముదాయాలు తొలగించి 100 రోజులు అయిన సందర్భంగా నేటికీ అభివృద్ధికి నోచుకోకపోవటంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే కిలారిపై వ్యతిరేక నినాదాలు చేశారు.

గరంగరంగా మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పొన్నూరు : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం గరంగరంగా జరిగింది. ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షత సమావేశంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య పాల్గొని అభివృద్ధి పనుల బిల్లులు చేయకుండా నిర్లక్ష్య ధోరణి వహిస్తున్న అధికారులపై ఆగ్రహంతో అసహన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీతం తీసుకుంటున్న అధికారులు నిర్లక్ష్యం విడకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్ పనులు వేగవంతం చేయాలన్నారు.

స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం

విశాలాంధ్ర-తుళ్ళూరు : శివాలయంలో నాగుల చవితి సందర్భంగా శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమేశ్వరుని పవిత్రమైన కార్తిక మాస శుక్రవారం, నాగుల చవితి పర్వదినం కావడంతో చుట్టుపక్కల గ్రామాల భక్తులు వేకువజామున ఆలయం వద్దకు చేరుకుని పుట్టలో పాలు పోసి పొంగళ్లు వండి స్వామివారికి నివేదించారు. అనంతరం పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం చేశారు.

నీరు అవసరం లేని పంటలే సాగు చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగినంతగా లేని కారణంగా రబీలో సాగునీటి సరఫరా జరగదని, నీటి అవసరం తక్కువగా వుండే పప్పుధాన్య రకాలైన మిను ము, పెసర పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని జిల్లాలోని రైతులను కోరుతూ జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా నీటి పారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 10.20 టీయంసీ లు, నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 26.13 టీయంసీ లు, పులిచింతల ప్రాజెక్టులో 10.29 టీయంసీ లు మాత్రమే వినియోగించుకోవడానికి అందుబాటులో ఉన్నాయని, వీటిని త్రాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించనున్నారన్నారు. అందువల్ల రబీలో నాగార్జున సాగర్ ఆయకట్టుకి, కృష్ణా వెస్టన్ డెల్టా ఆయకట్టుకి సాగునీరు సరఫరా జరగదని ఇరిగేషన్ అధికారులు తెలియజేశారన్నారు. జిల్లాలో నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంత రైతులు నీటి అవసరం లేని శెనగా, మినుములు కృష్ణా వెస్టన్ డెల్టా ఆయకట్టు రైతులు మినుము, పెసర వంటి పంటలను మాత్రమే సాగు చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఎస్. శివరామకృష్ణ మాట్లాడుతూ రబీలో నీటి అవసరం లేని మినుము, పెసర పంటలలో మేలు రకాలను రైతులకు సిఫార్సు చేయడంతో పాటు అవసరమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో వుంచేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఏపీఎంఐపీ ప్రాజెక్టు మేనేజరు వజ్రశ్రీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు జి.లక్ష్మీ, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజరు సుబ్బయ్య, ఆత్మ డీడీ రామాంజనేయులు, జిల్లా నీటి పారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించరు : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఎన్నికల నిబంధనల మేరకు అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించడానికి వీలు లేదని, తొలగింపు ఆర్జీలను సూపర్వైజరి, ఏఈఆర్ఓలు ప్రత్యక్షంగా పరిశీలన చేస్తారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విభాగ విధుల నిర్వహణపై ఏఈఆర్ఓలు, సూపర్వైజరి అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించరని, అలా ఎక్కడైనా జరిగితే పీపుల్స్ రిప్రజంటేటివ్ యాక్ట్ 1950 ప్రకారం జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఓటర్ల ముసాయిదా లిస్టు మేరకు బిఎల్ఓల క్షేత్ర స్థాయి పరిశీలనలో నాట్ ట్రేస్డ్ ఓటర్లకు ఎన్నికల నిబంధనల మేరకు రిజిస్టర్ పోస్ట్ చేశామని, 15 రోజుల్లో నిర్దేశిత ఓటర్ల నుంచి తగిన వివరణ రాకుంటే ఏఈఆర్ఓల పర్యవేక్షణలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా వారి ఓటు తొలగిస్తారని తెలిపారు. స్వచ్ఛ ఓటర్ల లిస్టు తయారికి ఇదే చివరి అవకాశమని, బిఎల్ఓలు మరింత అప్రమత్తంగా తమ పరిధిలోని ఓటర్ల లిస్టు సరి చేయడానికి కృషి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల నుండి, ప్రజల నుండి అందిన ఫారాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ద్వారా పరిష్కరించాలన్నారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివ జ్యోతి, ఏఈఆర్ఓలు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, సూపరిండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ, సూపర్వైజరి అధికారులు పాల్గొన్నారు.

వెల్లి విరిసిన సృజన నమూనాల ఆవిష్కరణ

విశాలాంధ్ర, తెనాలి : నూతన విద్యా విధానానికి అనుగుణంగా బాలబాలికల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో శుక్రవారం విన్నూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చిన్నారులతో వారి తల్లిదండ్రులతో కలసి పలు రకాల గృహాల నమూనాలను తయారు చేశారు. నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి పర్యవేక్షణలో, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో, లీడ్‌స్కూల్ వారి సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో మురళీకాంత్ మాట్లాడుతూ పిల్లలు తరగతి గదిలో డిజిటల్ తరగతుల ద్వారా చూసినవి, పాఠ్యాంశాలలో నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పిస్తే మరింత మేలు జరుగుతుందనే ఆశయంతో ఈ వినూత్న కార్యక్రమం జరిపినట్లు తెలిపారు. ఐబ్టీ విధానానికి స్వస్తి పలికి వివిధ కృత్యాలు, నమూనాలు, ప్రదర్శనలు, దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా విద్యాబోధన, ప్రయోగాత్మక విద్యాబోధన ఇత్యాది అనేక అంశాలు ఈ కార్యక్రమంతో ముడిపడి ఉన్నట్లు మురళీకాంత్ తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమంలో తామూ కూడా భాగస్వాములు కావడం వల్ల పిల్లలకు భవిష్యత్తులో మరింత మేలు చేయడానికి ఆస్కారం ఉంటుందని తల్లిదండ్రులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు వారి తల్లిదండ్రులతో కలసి అప్పటికప్పుడు తయారు చేసిన పలు రకాల గృహాల నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బాలబాలికలు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగు లాభదాయకం

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు : దేశానికి వెన్నెముక రైతన్న అని, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మిశ్రమ పంటలు సాగు చేయడం ఉత్తమ మార్గమని గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి అన్నారు. ప్రతిపాడు నియోజకవర్గం, వట్టిచెరుకూరు మండల పరిధి పుల్లడిగుంట వద్ద గల రైతు నేస్తం ఫౌండేషన్‌లో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రెడు రోజులు దక్షిణ కోస్తా జిల్లాలలోని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్స్, ట్రైనర్స్‌కు శిక్షణా కార్యక్రమం జరిగింది. పిజిఎస్ ఇండియా, జేవీకే ఇండియా, సేంద్రియ భారత్ వంటి సంస్థల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించే రైతుల ఉత్పత్తులను, రసాయన వ్యవసాయ ఉత్పత్తుల ధరల కంటే అధిక ధర చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నట్లు రాజకుమారి తెలిపారు. రీజినల్ ట్రైనింగ్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఆర్‌పీసీ వెంకట్రావు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విధి విధానాలను గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కలుగజేసి ఆచరణలోకి తేవాలని, రైతులు పండించే పంటలను భాగస్వామ్య సంస్థలతో కలిసి మార్కెటింగ్ చేయాలన్నారు. మల్లేశ్వరి, సాయి, పున్నారావు, భాను, ఐదు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో టెండర్ పొందిన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమణాలు పాటిస్తూ పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు అందించిన ఆర్జీలను, ఫిర్యాదులను ప్రత్యేకంగా నమోదు చేయాలని, వారి సమస్యలు పరిష్కారం అయ్యాక తెలియచేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలోనే ఆయా స్టేజిల ప్రకారం పనులను ఎంబుక్ ను రికార్డ్ ఎమినిటి కార్యదర్శుల ద్వారా చేయించాలని ఏ.ఈ.లను ఆదేశించామన్నారు. బిల్లుల చెల్లింపులో కూడా జాప్యం లేకుండా అన్ని స్టేజిల్లో వేగంగా రికార్డ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్.ఈ.ని ఆదేశించారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరే షన్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లా లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి, జిల్లా ప్రభారీ అధికారి సాలోమన్ ఆరోక్యరాజ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి ఆరోక్యరాజ్, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారితో కలసి పాల్గొన్నారు. జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణకు సంబంధించి కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరిస్తు జిల్లాలో 258 గ్రామాల్లో 60 రోజుల్లో, గుంటూరు, తాడేపల్లి మంగళగిరి నగరపాలక సంస్థలతో పాటు తెనాలి, పొన్నూరు మున్సిపాల్టీలలో 40 ప్రాంతాల్లో 20 రోజుల్లో సంకల్ప యాత్రను జిల్లాకు కేటాయించిన రెండు ప్రచార వాహనాలు ద్వారా కార్యక్రమాలు నిర్వహించేలా షెడ్యూల్, రూట్ మ్యాప్ రూపొందించటం జరిగిందన్నారు. ఆరోక్యరాజ్ మాట్లాడుతూ జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణపై కలెక్టర్ చేపట్టిన చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె చంద్రశేఖరరావు, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ జె మోహనరావు, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ బ్రహ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

నాగేంద్రస్వామి సేవలో ఎమ్మెల్యే కిలారి

విశాలాంధ్ర-పొన్నూరు : నాగుల చవితి సందర్భంగా పట్టణ శివారు ప్రసిద్ధిగాంచిన శ్రీ నాగేంద్రస్వామి పుట్ట వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య పాల్గొని స్వామివారికి కుంకుమ పూలు సమర్పించి పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. చైర్మన్ వడాలశెట్టి శివ నాగేంద్రమ్మ, ఈవో శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ఇప్పటంలో కేంద్ర బృందం పర్యటన

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటంలో రాష్ట్ర ప్రభుత్వం కేటా యించిన సెంటున్నర స్థలాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పేద ప్రజలు నిర్మించుకున్న ఇళ్లను కేంద్ర హౌసింగ్ డిపార్ట్‌మెంట్ రీజనల్ కో- ఆర్డినేటర్ సునీల్ ఫరూక్ తన బృందంతో శుక్రవారం పరిశీలించారు. ఇప్పటంలో మొత్తం 35 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించగా అందులో ఇప్పటికే 28 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. పూర్తయిన నివాసాల గృహిణులతో సునీల్ ఫరూక్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా సొంత ఇల్లు లేనివారికి ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారని, ఆంధ్రప్రదేశ్లో జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ఇళ్లు చాలా అందంగా ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకోవడానికి 1లక్షా 75 వేల నగదు అందిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాన్ని ఇవ్వడంతో పాటు మౌలిక సదుపాయాలైన కరెంటు, రోడ్లు, మంచి నీటి సౌకర్యాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు మనీష్, ఎపి సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీరింగ్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారి నాగభూషణం, ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.వేణుగోపాలరావు, రిటైర్డ్ ఎస్పీ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌ను సీజీహెచ్‌ఎస్ పరిధిలోకి తీసుకురావాలి

సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్) హాస్పిటల్‌ను సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్) పరిధిలోకి తీసుకురావాలని ఏపీ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ కోరింది. హైదరాబాద్ లోని సీజీహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ జి.లక్ష్మయ్య ఇన్‌స్పెక్షన్ నిమిత్తం శుక్రవారం సీజీహెచ్‌ఎస్ వైద్యశాలకు వచ్చిన సందర్భంగా సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వివేకానంద, తిలక్ మాట్లా డుతూ హైదరాబాద్ ఎయిమ్స్ తరహాలో మంగళగిరి ఎయిమ్స్‌ను కూడా సీజీహెచ్‌ఎస్ బెనిఫిషరీస్‌కు అందుబాటులోకి తేవాలని కోరారు. ఎయిమ్స్ సీజీహెచ్ ఎస్‌లోకి వస్తే కోస్తాంధ్రాలోని కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు, ఉద్యోగులకు మెరుగైన వైద్యం ఉచితంగా లభిస్తోందన్నారు. సీజీహెచ్‌ఎస్ డిస్పెన్సరీలో దొరకని మెడిసిన్స్, ప్రైవేట్ మందుల షాపు నుంచి తెప్పించేటప్పుడు డాక్టర్లు రాసిన మందులను ప్రైవేట్ షాపు యాజమాన్యం చాలా వరకు తేవటం లేదన్నారు. తక్షణమే వారి కాంట్రాక్ట్ రద్దు చేయాలని కోరారు. గుంటూరు, విజయబాడలలో ప్రస్తుతం ఉన్న సీజీహెచ్‌ఎస్ డిస్పెన్సరీలు పై అంతస్తులలో ఉండటం వలన వృద్ధ పెన్షనర్లకు ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు. ఈ నేపధ్యంలో రెండు చోట్ల మార్చి గ్రౌండ్ ఫ్లోర్లలో సౌకర్య వంతంగా ఏర్పాటు చేయాలని కోరారు. గుంటూరులోని సుహ, శివ, ఆసుపత్రులకు ప్రభుత్వం సీజీహెచ్‌ఎస్‌కు అనుమతి ఇచ్చినప్పటికీ చిన్న టెక్నికల్ సమస్యతో ఆ రెండు ఆసుపత్రులకు సీజీహెచ్‌ఎస్ నెట్‌వర్క్ పని చేయటం లేదన్నారు. ఏడీ చొరవ తీసుకుని ఆ ఆసుపత్రులను బెనిఫిషరీస్‌కు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఏడీని కలిసిన వారిలో ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం నాయ కులు గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.కోటేశ్వరరావు, సీజీహెచ్‌ఎస్ డాక్టర్లు టీసీహెచ్ కోటేశ్వరరావు, డి.తుకారం, రామారావులు ఉన్నారు.

'అపోలో లివర్ క్లినిక్' ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బృందావన్ గార్డెన్స్ అయ్యప్పస్వామి టెంపుల్ రోడ్డులో ఉన్న అపోలో క్లినిక్ నందు లివర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు లివర్ సర్జన్ డాక్టర్ ఎలంకుమారన్, లివర్ ఫిజీషియన్ డాక్టర్ వంశీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం 'అపోలో లివర్ క్లినిక్' వారు ప్రారంబించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎలంకుమారన్, డాక్టర్ వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ గుంటూరులో లివర్ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేషంట్లు గుంటూరులో అనేక మంది ఉన్నారని, ఈ నేపథ్యంలో ఆ పేషంట్ల కోసం గుంటూరులో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో వైద్య సేవలు ప్రారంబిస్తున్నట్లు చెప్పారు. ప్రతి నెల మూడవ శుక్రవారం చెన్నై నుంచి లివర్ వైద్య నిపుణులు గుంటూరుకు వచ్చి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఎవరైతే లివర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పేషంట్లు అపోలో అందిస్తున్న ఈ అత్యాధునిక వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసలు లివర్ పట్ల సరైన అవగాహన లేకపోవటం వలనే కేసులు విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. ఆల్కాహాల్ తీసుకుంటున్న వారికి..వైరల్ హెపటైటీస్, ఊబకాయం వల్ల ప్యాటీ లివర్ పెరిగి లివర్ సమస్యలు వస్తుంటాయని వారు పేర్కొన్నారు.

జెనిటిక్ కారణాల వల్ల కూడా లివర్ సమస్యలు రావొచ్చని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లివర్ సంబంధిత సమస్యలతో ఏటా 20 లక్షల మంది చనిపోతున్నట్లు వివిధ గణాంకాలు పేర్కొంటున్నట్లు వారు తెలిపారు. లివర్ ట్రాన్స్‌ప్లాంట్ వల్ల 95శాతం సక్సెస్ రేటు ఉంటుందన్నారు. లివర్ సమస్యకు నేటి ఆధునిక కాలంలో అత్యాధునిక వైద్య సౌకర్యాలు వచ్చినందున పేషంట్లు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో అపోలో క్లినిక్ గుంటూరు బ్రాంచ్ హెడ్ పవన్, సిబ్బంది ఉన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కవి సమ్మేళనం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జాతీయ 56వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గుంటూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు 4వ శుక్రవారం కవి సమ్మేళనం జరిగింది. జిల్లా రచయితల సంఘం కార్యదర్శి ఎస్ఎం.సుభాని కార్యక్రమాన్ని నిర్వహించారు. కవయిత్రులు, కవులు డాక్టర్ ఎం.లలిత కుమారి, షేక్ ఖాసింబి, పి.విజయశ్రీ, టి.పద్మావతి, యక్కంటి పద్మావతి, పి.భాగ్యలక్ష్మి, షేక్ బషీరున్నిసా బేగం, పి.దుర్గ, బి.జమదగ్ని, కొణతం నాగేశ్వరరావు, ఎవికె సుజాత, జి.నాసరయ్య (ప్రకాశం)ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలపై వారి వారి కవితలను వినిపించారు. అనంతరం వివిధ స్కూల్స్ విద్యార్థినీ, విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మీ, సీనియర్ సహాయకులు ఎం. సీతారామయ్య, గ్రంథపాలకులు చిన్నపరెడ్డి, ఎన్.నాగిరెడ్డి, ఐవీ దుర్గారెడ్డి, కార్యాలయ, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

9 శాతం వడ్డీతో బకాయి చెల్లించండి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మరణించిన ఎల్ఐసి ఏజెంట్ దొంతా మంగమ్మ కుటుంబానికి 9 శాతం వడ్డీ కలిపి బకాయి చెల్లించాలని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసి) సంస్థను ఆదేశిస్తూ వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్ టి.సునీత తీర్పు ఇచ్చారు. వివరాలలోకి వెళ్తే దొంతా మంగమ్మ 2003 నుంచి 2021 మార్చి వరకు ఎల్ఐసి ఏజెంట్‌గా పనిచేశారు. అయితే 2021 మార్చి 31వ తేదీన ఆమె మరణించారు. ఈ నేపథ్యంలో తన భార్యకు రావాల్సిన బకాయిల నిమిత్తం ఆమె భర్త దొంతా వెంకటేశ్వర్లు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. వాది తరపు వాదనలు విన్న వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్ సునీత దొంతా మంగమ్మ కుటుంబానికి బకాయిల నిమిత్తం రూ.10 లక్షలు, డామేజ్ రూ.5000, మెంటల్ అగొనీ రూ.5000, కోర్టు ఖర్చులు నిమిత్తం రూ.3000లు ఆరు వారాలలో 9 శాతం వడ్డీ కలిపి చెల్లించాలంటూ ఎల్ఐసి సంస్థను ఆదేశిస్తూ తీర్పు వెలువరించారు. వాది తరపు ప్రముఖ న్యాయవాది మంగళపూరి శ్రీనివాసరావు వాదించారు.

జీవన ప్రతిబింబాలు బాలల చిత్రాలు

విశాలాంధ్ర, తెనాలి : తెనాలిలో అంతర్జాతీయ బాలల చిత్రోత్సవాలు నాలుగవ రోజు శుక్రవారం కొనసాగాయి. వేలాది మంది బాలలు కేరింతలు కొడుతూ చిత్రోత్సవాల్లో పాల్గొన్నారు. తెనాలి, బుర్రిపాలెం రోడ్డులో వివేకానగర్‌లో ఎ.వి.ఎస్. ఎంటర్‌టైన్ థియేటర్‌లో బాలలకు ఎ జర్నీ అరౌండ్ ది వరల్డ్, ది చిల్డ్రన్స్ ఆఫ్ హెవెన్ చలన చిత్రాలు ప్రదర్శించారు. గ్రామీణ బాలబాలికలు చిత్రాలను వీక్షించారు. కొల్లిపర డిగ్రీ కళాశాల కరస్పాంటెండెంట్, కళాలయ ప్రధాన కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథి సందేశమిస్తూ వినోదం విజ్ఞానం సందేశం మేళవించిన సినిమాలు ఎక్కువగా రావాలన్నారు. చిల్డ్రన్స్ ఫిలిం సొసైటి గత దశాబ్దాలుగా చిత్రోత్సవాలు జరపటం పట్ల హర్షాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఫిలింసొసైటి అధ్యక్షులు డా.రావిపాటి వీరనారాయణ, ఉపాధ్యక్షులు రామరాజు, మురళి, చినచౌదరి, నవీన్, సెంట్రల్ స్కూల్ నిర్వాహకులు వెంకట రాము తదితరులు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ చిత్రోత్సవాలు ఈ నెల 30వ తేదీవరకు బాపట్ల, పల్నాడు జిల్లాలో కూడా కొనసాగుతాయన్నారు.

బొప్పన విజయకుమారికి సీపీఐ నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి : నగరంలోని ఇప్పటం రోడ్డులో గల వరుణ్ రెసిడెన్సిలో బొప్పన విజయ్‌కుమార్ రిటైర్డ్ డీఎస్పీ వారి సతీమణి బొప్పన విజయ కుమారి ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, గోహార్, జానీ, హానోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పూత దశకు కంది

విశాలాంధ్ర-తాడికొండ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు వేసిన కంది పంట పూతదశకు చేరింది. గడచిన పది సంవత్సరాలుగా మండలంలో కంది సాగు విస్తీర్ణం తగ్గింది. పూత, పిందేదశలో తెగుళ్ల రావడంతో రైతులు ఈ పంటపై అంతగా ఆసక్తి చూపటం లేదు. నామమాత్రంగా కంది పంటను సాగు చేస్తున్నారు. కొందరు రైతులు కుటుంబ అవసరాల నిమిత్తం తమ పొలంలో కొంత భాగం పొలం గట్లపై కందిని సాగు చేస్తున్నారు. పంట ఎనిమిది నెలలకు చేతికి వస్తుంది. ఈ ఏడాది మండలంలో 60 ఎకరాలు పైబడి రైతులు కంది పంటను సాగు చేస్తున్నారు. పంట ఏపుగా పెరిగింది. పూత దశకు చేరింది.

CHANGE OF NAME

I, **GURINDAPALLI SUNITHA** (Old Name), W/o. GURIVINDAPALLI JOHN PRASAD, R/o. D.No.36-17-916, Nirupedala Colony, 2nd Line, Guntur - 522002, Guntur District, Andhra Pradesh, have changed my name to **GURIVINDAPALLI SUNEETHA**. Hereafter my name is known as **GURIVINDAPALLI SUNEETHA**.

నోటీసు

మహారాజశ్రీ పొన్నూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No.259/2023 in O.S. No.93/2022
Between:
సుంకర బుల్లిబాబు ...పిటీషనరు/వాది
మరియు
వెలగా సాంబశివరావు ...రెస్పాండెంట్/ప్రతివాది
To:
వెలగా సాంబశివరావు, **S/o.** లేటు అంకమ్మ, నివాస డోర్.నెం.2-22, కాకుమాను పోస్టు & (మం), గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలోని ఐ.ఏ.259/2023ను ఫైనల్ డిక్రీ పిటీషన్‌ను రెస్పాండెంట్ అయిన మీకు నోటీసునిమిత్తం పేపరుపబ్లికేషన్ ద్వారా తెలియ జేయమని కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు **ది.24-11-2023**న ఉ॥గం॥10-30ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీపరోక్ష మున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం),
వాయిదా తేది:24-11-2023

యం.పి.ఆర్.వి. ప్రసాద్
పిటీషనర్/ వాది తరపు న్యాయవాది. సాయినగర్ పొన్నూరు. సెల్: 9848012186

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

పిల్లల్లో పఠనాసక్తి కలిగించే బాధ్యత తల్లిదండ్రులదే

విశాలాంధ్ర-చిలకలూరిపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంధాలయ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవా లలో భాగంగా నాలుగో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట నిర్వహణలో కార్యక్రమాలు జరిగాయి. ఆ క్లబ్ అధ్యక్షులు రావికింది మణికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ న్యాయవాది, మాజీ ఎజిపి నక్క కోటేశ్వరమ్మ పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో పఠనాసక్తి కలిగించే బాధ్యత తల్లి దండ్రులదే అన్నారు. బాల్యంలోనే పుస్తక పఠనం అలవాటు చేయలన్నారు. విద్యార్థులకు పర్యావరణం పై చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ మాజీ అధ్యక్షులు పొలిశెట్టి నాగేశ్వరావు, ఎక్కల దేవేంద్ర రాజేష్, లయన్స్ మహిళ క్లబ్ అధ్యక్షురాలు ఆర్.లీల కీర్తన, ఈదర గోపి చంద్, డా.పివి సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి నాగుల్ మీరా వలి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన

విశాలాంధ్ర-పెదకూరపాడు : స్థానిక కచ్చేరి సెంటర్‌లో శుక్రవారం దిశ యాప్‌పై ప్రజలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రామాజీ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో దిశ యాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగని ప్రతి ఒక్కరూ లైసెన్సుతో పాటు రోడ్డు ప్రమాదాల భద్రతపై హెల్మెట్ ఉపయోగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థానిక ప్రజలు దిశ యాప్ ఫోన్లో డౌన్లోడ్ చేశారు.

ఆర్బీకే సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర-గురజాల: మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు శుక్రవారం ఖరీఫ్ పంట కోత ప్రయోగాలు నిర్వహించి వాటిని సిసి ఈ యాప్ నందు నమోదు చేయుటపై డి.వై.యస్.ఓ అయ్యూబ్ శిక్షణ ఇచ్చారని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సంధ్యారాణి, ఎ.యస్.ఓ ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ ఖరీఫ్ 2023 ఈ క్రాప్ నమోదు అయిన రైతులందరికీ భౌతిక రసీదులను అందజేయాలని రైతు భరోసా సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలు సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా నాగుల చవితి

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక తిమ్మాయ పాలెం రోడ్డు బొప్పూడి నాగేశ్వరరావు ఆస్పటల్ ఎదురు నాగమయ్య పుట్ట వద్ద శుక్రవారం నాగుల చవితి వేడుకలు వేకువ జామున్ నుండే ప్రారంభమయ్యాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కనుల పండగగా నిర్వహించారు. ఈ వేడుకలను 15వ వార్డు టిడిపి ప్రెసిడెంట్ బత్తుల వెంకటరావు, శివరామకృష్ణ మాదాల వెంకట సాయి, మారుతి మెడికల్ వారి ఆధ్వర్యంలో నాగుల చవితి పండగ వేడుకలు పర్యవేక్షణలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకి తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-రాజుపాలెం: శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకులు కే. మహేశ్వరరావు నిర్వహించారు. ఈ పోటీలలో స్థానిక జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, నవోదయ పాఠశాల, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు, గ్రంథాలయ అధికారి, మాణిక్యరావు, రోశయ్య పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారుడు సాగర్ బాబు మృతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: వేలూరు గ్రామ సీపీఐ సానుభూతి పరులు, ప్రజా కళాకారులు వంజా సాగర్ బాబు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. అయన మృతి పట్ల పలువురు పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. సాగర్‌బాబు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో గ్రామ సర్పంచ్ బొంతా తిరపతయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, వేలూరు జాకబ్ యూనిట్ సిపిఐ కార్యదర్శి వంజా భగత్, నాయకులు బి భగత్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు

విశాలాంధ్ర-విజయపురిసౌత్: నాగులచవితి పండుగ వేడుకలు శుక్రవారం విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు భక్తి శ్రద్దలతో కుటుంబ సమేతంగా స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద నాగేంద్రస్వామి దేవాలయం, డౌన్ మార్కెట్, సాగర్ క్యాంప్ వద్ద ఉన్న పుట్టలలో సలివిడి, గుడ్లు, పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం నాగేంద్రస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల గ్రామాలలో గల శాఖా గ్రంథాలయాలలో గ్రంథాలయ వారోత్సవములలో భాగంగా నాలగవరోజైన శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మండలంలో సంతగుడిపాడు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రామంలో గల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినీలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. రొంపిచర్ల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అదే విధంగా సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించి ప్రముఖ కవి అచ్చుల సుబ్బారావుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖా గ్రంథాలయాల అధికారులు వెంకట్రావు, సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-మాచర్ల: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ జరగనున్నట్లు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్ శారద తెలిపారు. శుక్రవారం జడ్జి శారద మాట్లాడుతూ కక్షిదారులు లోక్ అదాలత్ వేదికను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, భరణం, గృహహింస, బ్యాంక్ లిటికేషన్ వంటి కేసులను ఈ వేదికపై పరిష్కరించుకోవచ్చున్నారు. రాజీకి ముందుకొచ్చిన వారు వారి కేసు వివరాలను ముందుగానే మండల న్యాయ సేవా కమిటీ సభ్యులకు లేదా సమీప పోలీస్ స్టేషన్లలో ముందుగానే సమాచారం అందించాల్సి ఉందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలోచించి ఓటు వేయాలి: ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఓటేసేటప్పుడే ఎవరికి వేస్తున్నారో, వాళ్లు స్థానికంగా ఉండి ప్రజాసమస్యలు, బాధలు, పట్టించుకుంటారో లేదో ఆలోచించుకోకపోతే మంత్రి రజిని లాంటి వారితో అవస్థలు పడాల్సి వస్తుందని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పనిచేసే వ్యక్తిని కాదని, స్థానికంగా ఉండని, స్థానిక పరిస్థితులపై కనీసం అవగాహన లేని వారిని ఎన్నుకుంటే ఏమవుతుందో చిలకలూరిపేట నియోజకవర్గంలో పరిస్థితులే నిదర్శమని ప్రత్తిపాటి చెప్పారు. చిలకలూరిపేట 29వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో పలు కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వైసీపీ నాయకురాలు షేక్ ఫాతిమా ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన 10 కుటుంబాలు ప్రత్తిపాటి సమక్షంలో తెలుగుదేశం కండువా కప్పుకున్నారు. వారందరికీ కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించిన ప్రత్తిపాటి.. మంత్రి విడదల రజిని తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నిత్యం అందుబాటులో ఉండి పనిచేసే తనకు ఓట్లేయకుండా మొహం కూడా తెలియని ఆమెను గెలిపిస్తే ఇప్పుడు ఎవరికీ దొరకడం లేదని.. పైగా అన్నింటిలో విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. చిలకలూరిపేట మొత్తాన్ని విడదల రజిని కుటుంబమే దోచేసిందని... కోటప్పకొండ, చీరాలకు వెళ్లే రహదారుల్లో భూములన్నీ కొట్టేశారని విమర్శించారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

విశాలాంధ్ర-దుర్గి: రాష్ట్రంలో ప్రస్తుతం వైసీపీ రాక్షస పాలన సాగుతోందని మాచర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జనసేన జిల్లా కార్యదర్శి పులి హరి అన్నారు. మండల కేంద్రమైన దుర్గిలోని సత్యసాయి కళ్యాణ మండపంలో శుక్రవారం టీడీపీ, జనసేన తొలి ఆత్మీయ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జూలకంటి మాట్లాడుతూ టీడీపీ, జనసేన అధినేతల ఆలోచనలకు అనుగుణంగా నేతలు, కార్యకర్తలు సమన్వయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పల్నాడులో తాగడానికి నీళ్ళు లేవుగాని, మద్యం మాత్రం ఏరులై పారుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే పిన్నెల్లి బ్రదర్స్ కనుసన్నల్లో మద్యం నడుస్తున్నాయని, సంవత్సరానికి 54 వేల కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఇన్నిసార్లు కరెంట్ చార్జీలు పెంచిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని, నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు అంటుతున్నాయని ఆయన ఆరోపించారు. జగన్ తెచ్చిన జాబ్ క్యాలెండర్ ఏమిటంటే వాలంటీర్ల వ్యవస్థ. తెలుగుదేశం పార్టీ హయంలో మంత్రి ప్రత్తిపాటి 30వేల కోట్లు ప్రత్యేక బడ్జెట్ ప్రవేశ పెట్టి రైతులకు వ్యవసాయ పరికరాలు అందించటం జరిగిందని తెలిపారు. సీఎం జగన్ బహిరంగ సభ జన సమీకరణకు ఎమ్మెల్యే బ్రదర్స్ అన్ని వ్యాపార వర్గాల నుంచి వసూళ్లు చేశారని, ఏ ఒక్కరిని వదిలిపెట్ట లేదన్నారు. ఓటు విషయంలో ప్రతి ఒక్కరూ చైతన్య వంతులు కావాలని కోరారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బుసా రామాంజనేయులు మాట్లాడుతూ టీడీపీ, జనసేన అధినేతల ఆలోచనలు అనుగుణంగా పని చేయడంతో పాటు కలిసి శ్రమించి ఉమ్మడి అజెండా ప్రజల్లోకి తీసుకువెళ్ళతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు మేకల దాసు, జానికీరామయ్య, సింగు నాగేశ్వరరావు, తోటకూర శ్రీను, రుద్రాల రవి, సూరె క్రిష్ణ, శెట్టిపల్లి నరసింహారావు, వెంకటేష్, బుగ్గ మల్లయ్య, మేకల హరి, మహిళలు , తదితరులు పాల్గొన్నారు.

ఓటు గెలుపునకు ఆయుధం..

విశాలాంధ్ర-కారంపూడి: గెలుపు కోసం ఓటును ఆయుధంగా మార్చుకుందామని మాచర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం టిడిపి, జనసేన పార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశం బస్టాండు సెంటర్‌లోని ఆంజనేయ కళ్యాణ మండపంలో జరిగినది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతు ఓటర్ల జాబితాపై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలన్నారు. డబ్లింగ్, అక్రమ ఓట్లను గుర్తించి బిఎల్‌వోలకు జాబితాను అందించాలన్నారు. అక్రమ ఓట్లను తొలగించే వరకు పోరాటాలు చేద్దామన్నారు. అధికార పార్టీ నాయకులు అక్రమ మార్గాల ద్వారా గెలుపొందాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు వెంటిలేటర్ మీద ఉందని, యువత తమ భవిష్యత్తు కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల సర్వేలన్ని టీడీపీకి అనుకూలంగా ఉన్నాయన్నారు. ఎన్నికల తరువాత కూడా టిడిపి, జనసేన పార్టీలు తమ స్నేహాన్ని కొనసాగించాలని ఆయన ఆశించారు. సమావేశం అనంతరం బ్రహ్మారెడ్డి తోటబజారులో పర్యటించారు. మహిళలు హారతులు పట్టి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సమావేశంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిబెట్ పోటీలు

విశాలాంధ్ర-దుర్గి: శాఖా గ్రంథాలయంలో శుక్రవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులకు డిబెట్ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని గ్రామానికి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ తాతా పార్థసారధి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవాలయాలలాంటి గంథాలయాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈపోటీల్లో గ్రామ పరిధిలోని పాఠశాలకు చెందిన 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్స్ విభాగంలో సీక్రెట్ హార్ట్ పబ్లిక్ స్కూలుకు చెందిన బి.శ్రీలత ప్రథమ స్థానం, ఎస్.మోక్ష ద్వితీయ స్థానం, శ్రీహర్ష పబ్లిక్ స్కూలుకు చెందిన కె.సరస్వతి తృతీయ స్థానం సాధించారు. అదేవిధంగా సీనియర్స్ విభాగంలో సీక్రెట్ హార్ట్ పబ్లిక్ స్కూలుకు చెందిన వి.అమృత లావణ్య ప్రథమ స్థానం, శ్రీహర్ష పబ్లిక్ స్కూలుకు చెందిన డి.శివనందిని ద్వితీయ స్థానం, దుర్గి జడ్పీహెచ్ఎస్ కు చెందిన బి.చంద్రశేఖరరావు తృతీయ స్థానం దక్కించుకున్నారు. పార్థసారధిని విద్యార్థుల సమక్షంలో శాలువాతో గ్రంథాలయ అధికారి పి.వేణుగోపి సన్మానించారు. లక్ష్మీ నారాయణ, షేక్ అబ్బాస్ ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆఫీస్ సబార్డినేటర్ మాచర్ల మెర్సి, కె.శ్రీనివాసరావు, బాబురావు, పాఠకులు పాల్గొన్నారు.

బాలికల రక్షణపై అవగాహన

విశాలాంధ్ర-రాజుపాలెం: పెద నెమలిపూరి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు బాలికల రక్షణ, సెల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై సత్తెనపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రేమయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఇష్టంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని, చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. నేటి హైటెక్ యుగంలో బుల్లి ఆయుధం అయిన సెల్ ఫోన్ వల్ల ఎన్నో ఉపయోగాలతో పాటు నష్టాలు కూడా ఎక్కువగా ఉన్నాయని, కావున విద్యార్థులు సెల్ ఫోన్ కు దూరంగా ఉంటే చాలా మంచిదన్నారు. అమ్మాయిలు, అబ్బాయిలు కూడా ప్రేమ పేరుతో మోసపోయి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, చిన్న వయసులో చదువు మీద తప్ప వేరే వాటి మీద ధ్యాస పెట్టడం మంచిది కాదన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ఎంతో కష్టపడుతున్నారని, పెద్దల ఆశయాలను పిల్లలు వమ్ము చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మల్లేశ్వరి, ఉపాధ్యాయులు గౌస్ మొహిద్దీన్, సుధాకర్, పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు కాత్యాయిని, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రాహుల్ గాంధీని కలిసిన పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెండ్ షేక్ మస్తాన్ వలి, సుంకర పద్మశ్రీ

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి: జీవీ

విశాలాంధ్ర-ఈపూరు: టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి పనిచేసి ఈ అరాచక వైసీపీ పాలనను ప్రజలకు తెలియజేసి రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, వినుకొండ మాజీ శాసన సభ్యులు జి.వి.ఆంజనేయులు కోరారు. శుక్రవారం భవిష్యతు గ్యారంటి కార్యక్రములో భాగంగా ఈపూరు మండలంలోని దుష్మన్ పేట తండా, కొచ్చెర్ల ,రంగాపురం తండా లలో గ్రామ టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకి గ్యారంటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. భవిష్యతు గ్యారంటి కరపత్రాలని ఇంటింటికీ వెళ్లి కలసి తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల్లో టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో జీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ఎస్సి, ఎస్టి, బి.సి. మైనార్టీలకు కార్పొరేషన్లకు విధులు ఎత్తివేసి అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచి తీవ్ర అన్యాయం చేశారు అని అన్నారు. అక్రమ వెంచర్లు, మద్యం, ఇసుక, మట్టి మాఫియా వ్యాపారం చేస్తూ వందలకోట్ల ప్రజాధనాన్ని అధికారాన్ని అడ్డం పెట్టుకొని లూటి చేసిన ప్రజాద్రోహి అని అన్నారు. జగన్ నాలుగేళ్ల పాలనలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై వేల కోట్లకు పైగా భారం మోపారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ రాజకీయ కక్ష, రాక్షస పాలన పై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, రానున్న ఎన్నికల్లో జగన్ రెడ్డి పాలనకు చరమగీతం పాడతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల పార్టీ అధ్యక్షులు తిరుమల శెట్టి బాలయ్య, సీనియర్ నాయకులు అయినల కోటేశ్వరరావు, బిలడుగు రామయ్య, ముంద్రు రామ్ కృష్ణ, వేణు, నర్రా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చేయడంలో భయమెందుకు?

విశాలాంధ్ర-మంగళగిరి : బీసీల అభ్యున్నతి కోసం ఉన్న అవకాశాలు, ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వమే అడ్డుకుని అణగదొక్కుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆరోపించారు. మంగళగిరి కార్యాలయంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అధ్యక్షతన ముఖ్య నాయకులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో కొనసాగిన ప్రభుత్వం, బీసీ వ్యక్తి ప్రధాన అయి ఉండి బీసీ వర్గాల అభ్యున్నతికి ఏం సహకరించారో చెప్పాలని ప్రశ్నించారు. కనీసం కులగణన చేయాలని ఏడు దశాబ్దాలు నుంచి బీసీ సంఘాలు పోరాడుతుంటే గత ఎన్నికల ముందు 2018లో రాజ్‌నాథ్ సింగ్ కులగణనకు అనుకూలంగా చేసిన ప్రకటన కార్యచరణకు నోచుకోలేదన్నారు. 2021 సెప్టెంబర్ 23న భాజపా కులగణన తమ విధానం కాదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయటం బీసీలను మోసం చేయడం కాదా?అని ఆయన ప్రశ్నించారు. వారి తప్పలను కప్పిపుచ్చుకునే విధంగా రానున్న ఎన్నికలలో కల్లబొల్లి కబుర్లు చెబితే బీసీలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, నియోజకవర్గం అధ్యక్షులు ఉడత శ్రీనివాస్, యువజన అధ్యక్షులు ఆలా శివాజీ, మంగళగిరి పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ధనుంజయ్, నియోజకవర్గ జాయింట్ సెక్రెటరీ తిరువీధుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శివప్రియ నగర ప్లాట్ల యజమానుల సమావేశం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: గణపవరం వెళ్లే మార్గంలో ఉన్న శివప్రియనగర్ అభివృద్ధి కమిటీ సమావేశం ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు కమిటీ నాయకులు పేలూరి రామారావు తెలిపారు. గత 25 సంవత్సరాల కిందట సుమారు 650 మంది అన్ని వర్గాల ప్రజలు వీటిని కొనుగోలు చేశారని తెలిపారు. అయితే ఆ తదుపరి అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్లాట్లు ఎటువంటి నోచుకోక పిచ్చి మొక్కలు పెరిగి పోయి చిట్టడవులుగా మారి పోయాయని, హద్దురాళ్లు తొలగింపుకు గురయ్యాయని వివరించారు. . ఇందులో ఉన్న ఐదు ఎకరాల భూమి (సుమారు 150ప్లాట్లు) అన్యాక్రాంతం కూడా అయినట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్లాట్ల అభివృద్ధి కోసం, ఇతర సమస్యలపై చర్చించటానికి ఈ నెల 19వ తేదీన ఎన్ఆర్‌టీ రోడ్ లోని గ్రీన్ వ్యాలీ స్కూల్ ఎదురుగా వున్న, విజ్ఞాన విహార స్కూల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని సాయిరాం రియల్ ఎస్టేట్ కార్యక్రమంలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: విద్యార్థులు జీవితంలో సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవటం అన్నింటికన్నా ముఖ్యమైనదని కె.ఎల్.డీమ్డ్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు అన్నారు. వర్శిటీలోని ఆర్ట్స్ విభాగం (బి.ఏ.ఐ.ఏ.ఎస్.) ఆధ్వర్యంలో జరిగిన భారత రాజ్యాంగ దినోత్సవం ఎత్నిక్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. భారతీయ సంప్రదాయ విలువలు, భారత రాజ్యాంగ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాన్ని ఏర్పరుచుకున్న తరువాత దృఢ చిత్తంతో, అంకితభావంతో లక్ష్య సాధన కోసం నిరంతర ప్రయత్నం సాగించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, ఎన్.వెంకట్ రామ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగ అధిపతి డాక్టర్ పోలురాజు, ఎం.హెచ్.ఎస్. డీన్.డాక్టర్ ఎం.కిషోర్ బాబు, బి.ఏ.(ఐ.ఏ.ఎస్) విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య, ఉప విభాగాధిపతి డాక్టర్ కె.అనిల్ కుమార్, డాక్టర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో సూపర్వైజర్ చేతివాటం

బెల్టు షాపులకు తరలిపోతున్న మద్యం
దుకాణాలపై నామమాత్రపు పర్యవేక్షణ

విశాలాంధ్ర-శావల్యాపురం: ప్రభుత్వ మద్యం దుకాణాలు సిబ్బందికి కాసులు కురిపిస్తున్నాయి. సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు చేతివాటం ప్రదర్శిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా మద్యాన్ని బెల్ట్ షాపులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్వైజర్ రూ.5.50లక్షల నగదు గోల్మాల్ చేసి పరారయిన సంఘటన శావల్యాపురం మండలంలోని కారుమంచి గ్రామ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో శుక్రవారం జరిగింది. నర్సరావుపేట డిపో ఎక్సైజ్ సీఐ మున్నంగి ప్రమీల తెలిపిన వివరాల మేరకు కారుమంచి సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణం నెంబర్ 7960లో సూపర్వైజర్ విధులు నిర్వహిస్తున్న కారుమంచి గ్రామానికి చెందిన రాయల రామకోటేశ్వరరావు ఈనెల 15వ తేదీన షాపులో అమ్మిన మద్యం బాటిళ్ళ తాలూకు చెలానాను 16వ తేదీ మధ్యాహ్నానికి కూడా చెల్లించక పోవడంతో అనుమానం వచ్చి వెరిఫికేషన్ ఆఫీసర్ను దుకాణం దగ్గరకు తనిఖీకి పంపించగా దుకాణంలో సూపర్వైజర్ లేకపోవడంతో పాటు మద్యం నిల్వలలో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దాంతో శుక్రవారం దుకాణంలో తనిఖీలు నిర్వహించగా. మొత్తం 32150 మద్యం బాటిళ్ళు ఉండాల్సి ఉండగా 28,650 బాటిళ్ళు మాత్రమే ఉన్నాయని, 3500 మద్యం బాటిళ్ళు బార్ కోడ్ స్కాన్ చేయకుండా సూపర్వైజర్ అక్రమంగా అమ్మినట్లు గుర్తించామని, వాటి విలువ సుమారు రూ.5.50 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. సూపర్వైజర్ కుటుంబసభ్యులు చెల్లించాల్సిన నగదులో రూ.2లక్షలను శుక్రవారం జమచేశారని, మరో రూ.3.50లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. సూపర్వైజర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, కనీసం మొబైల్ ఫోన్ కూడా వెంట తీసుకెళ్ళలేదని తెలిపారు. సూపర్వైజర్పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అతడు పట్టుబడిన వెంటనే విధుల నుండి తొలగిస్తామని తెలిపారు. తనిఖీలలో ఎక్సైజ్ ఎస్ఐ రంగిశెట్టి పూర్ణచంద్రరావు, కానిస్టేబుల్ మల్లాపరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలి : ఎంపీ

విశాలాంధ్ర-నరసరావుపేట: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలని విజయవాడ ఎంపీ కేశినేని నాని కోరారు. శుక్రవారం స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల ఆవరణలో నల్లపాటి ట్రస్ట్ వ్యవస్థాపకులు నల్లపాటి రామ చంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నల్లపాటి భరోసాలో భాగంగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ కల్పన కోసం నిర్వహించిన ఉద్యోగ మేళాలో మాట్లాడారు. ఏపీ విద్యార్థులు చదవు, స్కిల్స్, ఉద్యోగం, సంపా దనలో ముందుండాలని సూచించారు. హైదరాబాద్‌లో ఐటీ ఏర్పాటు కోసం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని అన్నారు. స్కిల్ ఆంధ్రా, స్టార్టప్ ఆంధ్రా, మేకిన్ ఆంధ్రాగా ఉండాలని చంద్రబాబు కోరుకున్నారని అన్నారు. రాజధాని లేని రాష్ట్రంలో నిరుద్యో గులకు ఉపాధికల్పన చేసిన వ్యక్తి చంద్రబాబు అని, అలాంటి చంద్ర బాబును స్కిల్ స్కాం అంటూ అరెస్ట్ చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ నిరుద్యోగులకు నల్లపాటి ట్రస్ట్ భరోసా కల్పిస్తుందన్నారు. అరాచక ప్రభుత్వంలో జాబ్ మేళా ఏర్పాటు చేసిన ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు సీఎంగా ఉంటేనే ఉద్యోగాలు వస్తాయన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు నల్లపాటి రాము మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా వైద్య సేవలు అందించామని, నేడు ఉద్యోగాలకు మేళా నిర్వహిస్తున్నామన్నారు. చదువులు ముగించిన వారు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేళాలో జీవీ ఆంజనేయులు, డాక్టర్ అరవిందబాబు, లింగమనేని శివరాంప్రసాద్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, కపలవాయి విజయ కుమార్, నాగవరపు సుబ్బరాయ గుప్తా, డాక్టర్ రవీంద్ర బాబు, వనమా శివ తదితరులు పాల్గొన్నారు. తొలుత నల్లపాటి ప్రమీలాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

వైసీపీ పేదల పక్షపాత ప్రభుత్వం

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్: సత్తెనపల్లి రూరల్ మండలం నంది గామ గ్రామంలో శుక్రవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాత ప్రభుత్వం ఇది అని, ఈ ప్రభుత్వమే మళ్ళీ రావాలని ప్రతి పేదవాడు కోరుకుంటున్నారన్నారు. పేదల ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. నందిగామకు రూ.40 కోట్ల ప్రత్యక్ష , పరోక్ష లబ్ధి సంక్షేమ పథకాలతో ప్రజల్లో పెరిగిన ఆర్థిక భరోసా అని వివరించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఒత్తిడికి లేకుండా విద్యా బోధన చేయాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : విద్యార్థుల ఒత్తిడికి లోనవ్వకుండా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కేవీ రమణ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదకూరపాడు శాఖ గ్రంథాలయంలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం రమణ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, వ్యాయామం, పోటీతత్వం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పరుగు పందాలు, మ్యూజికల్ చైర్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీయన్ వాణి, రాధాకృష్ణ, కాంచాయని తదితరులు పాల్గొన్నారు.

రానున్నది రోబోటిక్, డిజిటల్ టెక్నాలజీనే

విశాలాంధ్ర-పెదకూరపాడు : రానున్న కాలంలో అంతా రోబోటిక్, డిజిటల్ టెక్నాలజీదే అని రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు ఆర్. గోవిందరాజు, పల్నాడు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.మధుకుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని 75 తాళ్లూరు జడ్‌పి హైస్కూల్లో అటల్ ల్యాబ్‌ను సందర్శించి మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ కమీషనర్, పల్నాడు జిల్లా డిఈవో ఆదేశాల మేరకు జిల్లాలోని 26 జడ్‌పి హైస్కూల్స్‌లో ఉన్న అటల్ ల్యాబ్ పని తీరును పరిశీలించి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు నూతన టెక్నాలజీని ఉపయోగించి తాము తయారు చేసిన నమూనాలకు స్టార్టప్ ప్రోగ్రాం క్రింద ప్రోత్సాహక నగదు, పేటెంట్ పొందవచ్చని తెలిపారు. లైఫ్ స్కిల్స్ డెవలప్ చేసుకుని ఇన్నోవేటివ్ స్పిరిట్‌తో విద్యార్థులు ముందడుగు వేయాలని తెలిపారు. మెంటర్ సుస్మిత, సైన్స్ ఉపాధ్యాయులు సుబ్బారావు, భాస్కరరెడ్డిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పి.వాణీ, పీసీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధూళిపాళ్లపై నాన్ బెయిల్‌బుల్ కేసు దుర్మార్గం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాము అనే వ్యక్తి సంగండైరీ వద్ద సెక్యూరిటీ సిబ్బందితో గొడవపడితే... పోలీ సులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పై సెక్షన్ 307 క్రింద నాన్ బెయిలబుల్ కేసు పెట్టడం దుర్మార్గం అని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యా లయంలో విలేకరుల సమావేశం జరిగింది. మాణిక్యరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో తప్పుడు కేసులు పెట్టే సంస్కృతి రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందన్నారు. సంగం డైరీ ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారు. సంగండైరీని లాక్కోవాలని శతవిధాలా ప్రయత్నం చేసారు. సంగండైరీని లేకుండా చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి రంగంలోకి దిగినా వల్లకాని పరిస్థితి. సంగండైరీ మీద పెట్టిన కేసుల్లో ఒక్కటి కూడా నిరూపించ లేకపోయారు. సంగండైరీని ఏమి చేయలేకపోయామనే కక్షసాధింపుతో ఆరోజు నుండి ధూళిపాళ్ళ నరేంద్రని ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నారు. నిజంగా హత్యలు, దుమ్మిలు చేసినవాళ్ళని పోలీసులు ఎక్కడా అరెస్టు చేసిన పాపాన పోలేదన్నారు. ధూళిపాళ్ళ నరేంద్రపై అక్రమంగా పెట్టిన సెక్షన్ 307 కేసును వెంటనే ఎత్తివేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. టిడిపి నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, వలివేటి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం

విశాలాంధ్ర, తెనాలి : తెనాలి, నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం 4వ రోజు కొనసాగాయి. ఔత్సాహిక రచయితపాత్ర అంశంపై కవి సమ్మేళ కార్యక్రమం జరిగింది. కవి సమ్మేళనంలో కవులు తెలుగు భాషాభివృద్ధి, రచయితల పాత్ర అనే అంశంపై కవితలు, పాటలు, పద్యాలు, గానం చేశారు. కార్యక్రమానికి గ్రంథాలయ అధికారిణి కాపూరి రమాదేవి అధ్యక్షత వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రంథాలయాలు బాలలకు, విద్యార్థులకు, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుండి గ్రంథాలయ పఠనం అలవాటు చేసేందుకు గ్రంథాలయాలకు పంపాలని చెప్పారు. రమాదేవి మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో వేలాది పుస్తకాలు ఉన్నాయని 25వేలకు పైగా పాఠకులు ఈ గ్రంథాలయ సేవలను వినియోగించుకుంటున్నారని చెప్పారు. వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 20న బహుమతులు అందజేస్తారు.

పాస్‌పోర్ట్ పోయినది

దిరిశినాల హనిమిరెడ్డి తండ్రి అచ్చిరెడ్డి అను నేను పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, సిరిగిరిపాడు గ్రామ నివాసినై యున్నాను. అయితే నాకు సంబంధించిన X6743720 నెంబర్ గల పాస్‌పోర్ట్ ఈనెల 14న సిరిగిరిపాడు నుండి వెల్దుర్తికి ఆటోలో వెళుతుండగా కనిపించకుండా పోయినది. ఎంత వెతికినను కనబడటం లేదు. ఎవరికైనా దొరికిన యెడల సెల్ నెం : 9553532774 కు తెలియజేయగలరు.

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చీరాల : విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని చీరాల శాఖా గ్రంథాలయం గ్రంథ పాలకురాలు డి.ధనమ్మ అన్నారు. శుక్రవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలని, సమాజంలో గ్రంథాలయాల పాత్రని తెలిపేందుకే ప్రతీ ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. శనివారం స్కిప్పింగ్ పోటీలు, పరుగు పందెం పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాణెమ్మ, నాగవీరభద్రాచార్యులు, సజ్జా వెంకటేశ్వర్లు, గాదె హరిహర రావు, చుండూరి కృష్ణ మూర్తి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెనరా బ్యాంకు సహకారం



విశాలాంధ్ర - చీరాల : ప్రతిభ కలిగిన విద్యార్థులకు కెనరా బ్యాంకు సౌజన్యంతో స్కాలర్ షిప్‌లు అందిస్తున్నామని కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఉమా రాఘవేంద్రరావు అన్నారు. కస్తూరి భా గాంధీ మునిసిపల్ హైస్కూలులో విద్యార్థులకు శుక్రవారం స్కాలర్ షిప్‌లు అందించారు. ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంక్ ఫౌండర్ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం అత్యంత ప్రతిభ కలిగిన విద్యార్థిని విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నామన్నారు. అందరికి అందుబాటులో కెనరా బ్యాంక్ సేవలు అందిస్తుందని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉదయసాయి లక్ష్మీ, ప్రిన్సిపాల్ కృష్ణా మోహన రావు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్షకు తరలి రావాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : కృష్ణ నది జలాల పంపిణీపై గెజిట్ విడుదలను నిరసిస్తూ ఈ నెల20,21తేదీల్లో విజయవాడలో జరిగే 30గంటల నిరసనదీక్షకు ప్రజలందరూ తరలి రావాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బత్తుల శామ్యూల్, మేడా వెంకట్రావులు పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిరసన దీక్ష గోడ పత్రికను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు,రైతు కూలీలు పంటలు వేసి దెబ్బ తిన్నారన్నారు. కూలీలు జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెడుతున్నారని తెలిపారు. రైతాంగ ప్రయోజనాలను విస్మరించి ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం సరికాదన్నారు. పూర్తి అయిన కృష్ణా జలాల పంపిణీపై మరల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా న్యాయపరంగా మనకు జలాలపై ఉన్న హక్కును వదులుకోకుండా ప్రజా ఉద్యమం అవసరం అయిన ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు నిష్క్రియాపరత్వంగా ఉండటం గర్హనీయమన్నారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం సీపీఐ చేస్తున్న ఉద్యమానికి ప్రజలందరూ మద్దతు తెలపాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల వల్ల 400లకు పైగా కరువు మండలాలు ఉన్నట్లు అధికారులు చెబుతుంటే వ్యవసాయ మంత్రి స్పందించకుండా సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రం వాటిని తగ్గించి కేవలం 100 మండలాల్లో కరువు ఉన్నట్లు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో వ్యవసాయశాఖ మంత్రి ఎవరో కూడా ప్రజలకు తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏగువన కురిసే భారీ వర్షాలకు వచ్చే నీటిని సముద్రం పాలు చేయడం తప్ప వాటిని నిల్వ చేసే సౌకర్యం, పొలాలకు తరలించి వ్యవసాయ అవసరాలకు వాడుకునే ప్రణాళికలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వద్ద లేవన్నారు. రాష్ట్రాల మధ్య వివాదాలు కల్పించడానికి తప్ప ఎప్పుడో ముగిసిన కృష్ణానది జలాల పంపిణీపై మరల గెజిట్ నోటిఫికేషన్‌ను ఇవ్వడాన్ని రద్దు చేయాలని, వలస వెళ్ళే రైతాంగ కూలీల సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యునిస్టు పార్టీ చేపట్టిన నిరసన దీక్షకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అచ్యుతుని బాబూరావు, నియోజకవర్గ కార్యదర్శి సి.హెచ్ ప్రకాష్ బాబు, వేటపాలెం మండల కార్యదర్శి డి.వెంకటేశ్వరరెడ్డి, కిరణ్,పేతురు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నిరసన దీక్షకు బీకేఎంయూ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సిపిఐ 30గంటల నిరసన దీక్షకు బి.కే.ఎం.యు సంపూర్ణ మద్దతు తెలుపుతుందని బీకేఎంయూ జిల్లా కార్యదర్శి జెల్డీ భాగ్య శ్రీధర్ తెలిపారు.పట్టణంలోని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ కృష్ణా జలాల పు:న పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ రద్దు కోరుతూ కరువు నివారణ సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిత కోసం ఈ నెల 20,21వ తేదీల్లో విజయవాడలో 30 గంటల నిరసన దీక్ష సిపిఐ తలపెట్టడం జరిగిందన్నారు.నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన నాటి నుండి ఆంధ్రప్రదేశ్‌పై సవతి తల్లి ప్రేమ కనపరుస్తూ విభజన హామీలు అమల్లో పూర్తిగా విఫలమైందన్నారు.మనకు రావాల్సిన నీటి వాటాలు రాకుండా రైతులను,వ్యవసాయ కూలీలను నిలువునా ఉంచుతున్నారని శ్రీధర్ తెలిపారు.కృష్ణా జలాల పు:న పంపిణీపై గజట్ నోటిఫికేషన్ రద్దు చేయకపోతే ఆంధ్ర ఎడారిగా మారుతుందని కరువు,వలసలు, ఆత్మహత్యలు ప్రారంభమవుతాయన్నారు.నీరు లేకపోతే పంటలు పండకపోవటంతో వ్యవసాయ పనులు ఉండవన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కరువు తాండవిస్తుందని సిపిఐ తలపెట్టిన 30 గంటల దీక్షకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కూలీలు నిరసన దీక్షలో పాల్గొని దీక్షను జయప్రదం చేయాలని 20,21 తేదీల్లో విజయవాడ తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలకు శ్రీధర్ పిలుపునిచ్చారు.అనంతరం చలో విజయవాడ గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సీనియర్ నాయకులు మామిడి బత్తుల అశోక్, పి.ఫణి, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్ష జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల : ఈనెల 20,21వ తేదీన విజయవాడలో జరుగు 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని సీపీఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ అన్నారు.కృష్ణా జలాల పంపిణీ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్,కరువు సమస్యలు రాష్ట్రంలో దాదాపుగా 440 కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష గోడ పత్రికలను సంతమాగులూరు మండలం ఏల్చూరి గ్రామంలో సిపిఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ,వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అద్దంకి నాగేశ్వరరావు మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రమణయ్య, ప్రసాదు,ఆంజనేయులు దుర్గాప్రసాద్ ఏలూరి రామ్, వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు.రాష్ట్రమంతా కరువు ఏర్పడి ఉంటే కేవలం 101 మండలాలు మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం దారుణమని పంటలు ఎండిపోయి రైతులు విలవిల్లాడిపోతుంటే రాష్ట్రంలోని అధికార పార్టీ రాజకీయ నాయకులు అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ ఎలాంటి సహాయక చర్యలు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు.నాగార్జునసాగర్ కుడి కాలవ పరిధిలో 90 శాతం నీటి ఎద్దడి వల్ల పంటలు వేయలేదని కరువు నివారణ సహాయకు చర్యలు అందించాలని డిమాండ్ చేశారు.మండలంలో ఉన్న రైతాంగమంతా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళ్దాం: ఆనందబాబు

విశాలాంధ్ర - వేమూరు : రాష్ట్రంలో అరాచక, ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దే దించేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగుతామని మాజీ మంత్రి టీడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్ బాబు తెలిపారు. వేమూరు నియోజకవర్గ ఆత్మీయ సమావేశం శుక్రవారం స్థానిక లక్ష్మి పద్మావతి కల్యాణ మండపంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, జనసేన నియోజక వర్గ సమన్వయ కర్త ఊసా రాజేష్‌ల పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యక్రమాల నిర్వహణ గురించి చర్చించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, ఓటర్‌లిస్టు పరిశీలనపై సమావేశంలో చర్చించారు. ఆనందబాబు మాట్లాడుతూ శుక్రవారం నుంచి భవిష్యత్తు గ్యారెంటీ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించాలన్నారు. బూత్‌ల వారీగా ఓటర్ల జాబితా వెరిఫికేషన్ విధిగా చేయాలని, వేమూరు నియోజకర్గంలోని ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించి ఇకపై ప్రతి అంశంలోనూ రెండు పార్టీలు కలిసే ముందుకు నడవాలని నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో స్థానిక వైసీపీ ఎమ్మెల్యే మేరుగ నాగార్జున చేసిన అక్రమాలపై ఛార్జ్ షీట్ తయారుచేస్తామన్నారు. నిరుద్యోగం, కరువు పరిస్థితిపై ప్రజల్లోకి తీసుకెళ్లడం నియోజకవర్గంలో ఇరుపార్టీల సామాజికవర్గాలు (ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ) ఉమ్మడిగా కార్యక్రమాలు చేయాలనీ నిర్ణయించారు. అధ్వానంగా ఉన్న రోడ్ల దుస్థితిపై నిరసనలు చేయాలనీ అధిష్టానం నిర్ణయించిందని, దాని ప్రకారం కార్యక్రమం రూపొందించి నిర్ణయం తీసుకుంటామన్నారు. జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ మాట్లాడుతూ జనసేన నేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులందరూ టీడీపీతో కలిసి సమ స్వయంగా పోరా డేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, జొన్నలగడ్డ విజయబాబు, మైనేని మురళీకృష్ణ, దండే సుబ్బారావు, సాయిబాబా, ఎలవర్తి బ్రహ్మానందం, ఎల్లారెడ్డి, వాకా శేషుబాబు, జనసేన నాయకులు చేబ్రోలు బోడియ్య, శ్రీరామ్ మూర్తి,విష్ణు మొలకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసిన వైసీపీ : వేగేశన

విశాలాంధ్ర - పిట్టలవాని పాలెం : దళితలను మోసం చేసిన పార్టీ వైసీపీ అని నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.ప్రతి ఇంటికి టిడిపిని చేరువ చేయడమే లక్ష్యంగా వేగేశన నరేంద్ర వర్మ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం మీ మాటే-నా బాట, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని మండేవారిపాలెం గ్రామంలో నాయకులతో కలసి వెళ్లి పార్టీ విధి విధానాలు వివరిస్తూ మహిళలకు చీర ఇస్తు వారికీ నిత్యావసర వస్తువులు తెచ్చుకునే సంచి,తన గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేశారు. అనంతరం భవిష్యత్‌కు గ్యారంటీ పత్రాలలో వారి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసి భవిష్యత్తు గ్యారెంటీ సంక్షేమ పథకాలు గురించి అయన వివరించారు.తొలుత డాక్టర్.బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు ఎంతో ఉపయోగపడే 28 పథకాలను జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు చేశారని చెప్పారు.టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో దళితులు ఇళ్ళు నిర్మించుకుంటామంటే రూ.2 లక్షలు ఇచ్చారన్నారు.టీడీపీ హయాంలో దళితులకు కరెంటు ఫ్రీ ఉండేదని వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నిసార్లు కరెంటు చార్జీలు పెంచారో ప్రజలందరికి తెలుసు అన్నారు.ఈ కార్యక్రమంలో పిట్టలవాని పాలెం మండల పార్టీ అధ్యక్షుడు అఫ్జల్,టీడీపీ మండల నాయకురాలు డాక్టర్ గ్లోరి,యానెట్ సొపటి,టీడీపీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు రూ.10 కోట్ల పన్ను బకాయిలు

విశాలాంధ్ర-పర్చూరు: గ్రంథాలయాలకు రూ.10 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. స్థానిక గ్రంథాలయ శాఖను శుక్రవారం ఆమె సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. శాఖా వారోత్సవాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీలు, పురపాలక, నగరపాలక సంస్థల నుండి గ్రంథాలయాలకు సెస్ రూపంలో రావల్సిన బకాయిల వసూలుకు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. జిల్లాలో 66 గ్రంథాలయాలు ఉన్నాయని, వాటిలో 116 మంది ఉద్యోగులకు గాను 48 మంది మాత్రమే ఉన్నారని, మిగిలిన ఖాళీల భర్తీకి ఉన్నతాధికారులకు నివేదిక అందించామని తెలిపారు. గ్రంథాలయాలకు శాశ్వత భవనాలు 30 ఉన్నాయని, మిగిలిన 36 భవన నిర్మాణాలకు స్థల సేకరణ జరుగుతుందని, పూర్తి అయిన వెంటనే నిర్మాణాలు చేపడతామని ఆమె తెలిపారు. జిల్లాలోని గ్రంథాలయాలలో సభ్యత్వ నమోదు కొరకు పాఠశాలలను సంప్రదించాలని ఆమె గ్రంధపాలకులకు సూచించారు. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వీరివెంట గ్రంధపాలకుడు గుడిపాటి శ్రీనివాసరావు ఉన్నారు.

నిరుపేదల అభ్యున్నతికే భూమి పంపిణీ : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : సుదీర్ఘకాలంనాటి భూ సమస్యలన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు నిరుపేదలకు భూమి పంపిణీ చేస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. భూమి పంపిణీ, భూమి హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతి కొరకే భూమి పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. బ్రిటిష్ కాలం నాటి సమస్యలకు సైతం ప్రభుత్వం పరిష్కార మార్గం చూపిందన్నారు. దశాబ్దాలుగా భూమి అనుభవిస్తున్న వారికే హక్కు పత్రాలను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ముఖ్యంగా భూముల రీ సర్వే ప్రక్రియతో సమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కారమవుతున్నాయని తెలిపారు. భూమి లేని 1,023 మంది నిరుపేదలకు 790.43ఎకరాల అసైన్డ్ భూములను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.అందులోనే 376 మంది ఎస్సీలకు 173.11ఎకరాల భూమి, 90 మంది ఎస్టీలకు 64.46 ఎకరాలు, 43మంది బీసీలకు 33.84 ఎకరాలు, 514మంది ఓసీలకు 518.94 ఎకరాలను లబ్దిదారులకు అందిస్తున్నామని చెప్పారు.అలాగే జిల్లాలో 1,401మందికి 614.12 ఎకరాల లంక భూములకు హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. భూమి లేని నిరుపేదలకు రాష్ట్రప్రభుత్వం స్థిరాస్తిని సమకూర్చి ఇస్తుందని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి చెప్పారు.రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల పక్షాన నిలిచి, వారి సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పేదలకు భూమి పంపిణీ చేయడం కొరకు అధికారులు ఎంతో శ్రమించి భూమి హక్కు పత్రాలను సిద్ధం చేశారని ప్రశంసించారు. దశాబ్దాలుగా భూమి అనుభవిస్తున్నప్పటికీ ఎలాంటి హక్కులు లేని నిరుపేదలకు సర్వహక్కులు కల్పిస్తూ పత్రాలను అందించడం అభినందనీయమన్నారు. లంక భూములకు రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టాలు ఇవ్వడం సాహసోపేత నిర్ణయంగా ఆయన అభివర్ణించారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గడిచిన నాలుగేళ్ల పాలనలో పేదలకు ఎన్నో వరాలు కురిపించారని ఆయన కితావిచ్చారు.ఆది ఆంధ్ర,నరసయ్య పాలెం సొసైటీలకు కింద లబ్దిదారులకు భూమి హక్కు పత్రాలు సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సి.హెచ్ శ్రీధర్, డి.ఆర్.ఓ.పి. వెంకట రమణ, కలెక్టరేట్ ఏవో కె.గోపికృష్ణ,ఆర్డీఓ జి.రవీందర్, తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి స్వర్ణయుగం

విశాలాంధ్ర - యద్దనపూడి : టీడీపీతోనే రాష్ట్రానికి స్వర్ణయు గమని పార్లమెంటు అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు అన్నారు. మండలం చింతపల్లిపాడులో మన పల్లెకు మన ఏలూరి కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఏలూరి పాదయాత్ర నిర్వహించారు.నీరు చెట్టు ద్వారా అభివృద్ధి చేసిన నాయుడమ్మ చెరువును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనతో రాష్ట్ర పు:నర్ నిర్మాణం జరుగుతుందని,జగన్మోహన్ రెడ్డి పాలనలో అరాచకం విధ్వంసం తప్ప అభివృద్ధి లేదన్నారు.దళితుల పథకాలను తొలగించి అధికార మదంతో దాడులు దౌర్జన్యాలు చేస్తున్నారని మండిపడ్డారు.చంద్రన్న సీఎంని చేసేవరకు ప్రతి కార్యకర్త,నాయకుడు విశ్రమంచకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. జగన్ పాలనలో రాష్ట్రం ఒక అభివృద్ధి కూడా నోచుకోలేదని ధ్వజమెత్తారు. దోచుకోవడం దాచుకోవడం తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. పర్చూరు నియోజకవర్గంలో 14 వేల ఓట్లకు తొలగించేందుకు కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.గెలిచే సత్తా లేక ఓడిపోతామని భయంతో రాష్ట్ర వ్యాప్తంగా జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు.అధినేత చంద్రబాబుతో రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, మన పల్లెకు మన ఏలూరి కరపత్రాలు అందిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నల్లపునేని రంగయ్య చౌదరి,కనపర్తి నాగేశ్వరరావు,రాయపాటి సీతయ్య,గుదే తారక రామారావు, కర్లపూడి నారాయణస్వామి,కోయ సతీష్,కొరటాల వంశీకృష్ణ ,జంపని అంకమ్మ,సింగ్ చంద్రశేఖర్, బోయపాటి సాంబశివరావు,ఈరపనేని వాసు, సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ,ఈదల అనిల్ కుమార్,రాయుడు,పోత్తూరి అశోక్ రంగారావు,చింతపల్లిపాడు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో దేవాదాయ శాఖ భూములు

విశాలాంధ్ర-పర్చూరు: జిల్లాలో 3,850 ఎకరాలు ఎండోమెంట్ భూములు ఆక్రమణలో ఉన్నాయని జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి పానకాలరావు తెలిపారు. ఎండోమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూములు మొత్తం 24,406 ఎకరాలు ఉన్నాయని, వాటిలో అన్యాక్రాంతం, ఆక్రమణలో ఉన్నవాటిని చట్టప్రకారం స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. పర్చూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ఎండోమెంట్ భూములు 8,197 ఎకరాలు ఉన్నాయని, వాటిలో 1,774 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయని తెలిపారు. గతంలో కోర్టులో ఉన్న భూము లలో కాలయాపన జరిగేదని, ప్రస్తుత నూతనంగా రూపొందించిన చట్టప్రకారం ఆక్రమణదారులకు నోటీసులు జారీచేసి స్వాధీనం చేసుకుంటామని ఆయన తెలిపారు. సమావేశంలో ఎండోమెంట్ అధికారులు మీనిశెట్టి శ్రీనివాసరావు, కోటిరెడ్డి, మల్లవరపు నాగయ్య, పోతిన శ్రీనివాసరావు, రవికుమార్, ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్ ఉన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

విశాలాంధ్ర - నిజాంపట్నం : పుస్తక పఠనంతో విలువలతో కూడిన విజ్ఞానం వస్తుందని నిజాంపట్నం శాఖా గ్రంథా లయ అధికారి ఎన్.విజయలక్ష్మి అన్నారు.56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిజాంపట్నం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన సోపానా లన్నారు.విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవడాన్ని ఆలవాటుగా మార్చుకోవాలని సూచించారు.పుస్తకాలను చదవడం ద్వారా విషయ పరిజ్ఞానం,సమాజం పట్ల సమగ్ర అవగాహనను పెంపొందించుకోవచ్చునని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ మెంబర్స్ కొల్లిపర శ్రీనివాసరావు,షేక్ తాజుద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల : కార్తీక మాసం సందర్భంగా సముద్రతీరంలో స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్‌లోని స్పందన హాల్‌లో భక్తులకు సౌకర్యార్థం ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్ రెవెన్యూ,పోలీసు,పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కార్తీక మాసంలో బాపట్ల సూర్యలంక,చీరాల ఓడరేవు,రామాపురం బీచ్ ల్లో సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు.కార్తీక మాసం సందర్భంగా సోమవారం,కార్తీక పౌర్ణమి రోజుల్లో లక్షల్లో భక్తులకు వచ్చే అవకాశము ఉన్నందున పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.కార్తీక మాసం నేపథ్యంలో సముద్రం వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్,పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.భక్తులకు స్నానాలు చేయడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు.సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి,జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,డి.పి.ఓ దాసరి రాంబాబు,వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్,పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంత రావు,మత్స్య శాఖ జె.డి సురేష్ ,ఆర్.బి ఎస్.ఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్ కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర - చీరాల : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన కరణం వెంకటేష్ త్వరగా కోలు కోవాలని విజయవాడ మేరిమాత గుడిలో తలనీలాలు అర్పించామని మల్లెల లలితా రాజశేఖర్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు త్వరగా కోలుకుని ప్రజల మధ్యలోకి రావాలని మల్లెల లలితా రాజశేఖర్ విజయవాడ మేరిమాత గుడిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తలనీలాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదో వార్డు కౌన్సిలర్ మల్లెల లలితా రాజశేఖర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచే నాయకుడు కరణం వెంకటేష్ అని ప్రజలందరి ఆశీస్సులతో త్వరగా ప్రజల మధ్యకు రావాలని మేరిమాతను కోరామన్నారు.

విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ

విశాలాంధ్ర - మార్టూరు : 18మంది విద్యార్థినీ విద్యార్థులకు శ్రీ చైతన్య స్కూల్‌లో శుక్రవారం నాసా కిట్ల పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత షేక్ అబ్దుల్ రజాక్, తొండపు ఆదినారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికాలో ప్రతిష్టాత్మకమైన నాసా సంస్థ వారు నిర్వహించే నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌కు విద్యార్థుల చేత ప్రాజెక్టులు తయారు చేయించి విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యానికి అభినందనలు తెలిపి విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్,జయం అంజయ్య,ఆర్.ఐ జి.అప్పాజీ,కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : 26వ తేదీన కర్లపాలెంలో జరిగే రాజ్యాంగ ఆమోద దినోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయలని ఏఎన్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చార్వాక తెలిపారు.ఈ సందర్భంగా చార్వాక మాట్లాడుతూ పాలించే వాళ్ళు మంచి వాళ్ళు అయితే రాజ్యాంగం మంచిగా ఉంటుందని చెడ్డవాళ్ళు అయితే రాజ్యాంగం కూడా చెడ్డదైపోతుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగలో పేర్కొన్నారన్నారు.భారత రాజ్యాంగాన్ని 11నెల 17 రోజులు రచించి ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూసే విధంగా డాక్టర్ అంబేద్కర్ తయారు చేశారన్నారు.ఈ సభ ద్వారా ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ,క్రైస్తవర్గాలకు ఒక గొప్ప సందేశాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు.అనంతరం బాపట్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభకు సంభందించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో దళిత మహిళ నాయకురాలు పల్లం సరోజినీ, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజున్ బాబు, ఏఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు గొర్రెముచ్చు వందనం, పల్లం జీవన్ తదితరుల పాల్గొన్నారు.

బీసీ సమావేశం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెదేపా ఆధ్వర్యంలో శనివారం బాపట్లలోని ఎం.ఎస్.ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న అఖిలపక్ష బీసీ సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు.బీసీ నాయకులు,కార్యకర్తలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశానికి రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్,కొనకళ్ళ నారాయణ,వివిధ పార్టీల నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : టీడీపీ విధివిధానాలు నచ్చి మండలంలోని మండేవారిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ పార్టీ నాయకులు సుమారు 30మంది వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో టిడిపిలోకి చేరారు.ఈ సందర్భంగా వారిని నరేంద్ర వర్మ పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని,రాబోయేది టిడిపి పార్టీ ప్రభుత్వమేనన్నారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ అత్యంత పుణ్యఫలం

విశాలాంధ్ర - మార్టూరు : పవిత్ర కార్తీక మాసంలో అయ్యప్ప స్వామి మాలధారణ వలన అత్యంత పుణ్యఫలం సిద్ధిస్తుందని అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర కార్యదర్శి శంకరాచారి అన్నారు.అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ 3 సంవత్సరాలు పూర్తయి నాలుగవ వార్షికోత్సవం,శుక్రవారం నుండి మండల పూజ ప్రారంభాన్ని పురస్కరించుకొని ఏబీఏపీ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు మండలంలోని పలు గ్రామాల్లో ఏబీఏపీ జెండా విష్కరణ చేశారు.రాజుపాలెం గ్రామంలోని అయ్యప్ప స్వామి పీఠంలో అయ్యప్ప భక్తులు ఏబీఏపీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా శంకరాచారి మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో యువత దైవత్వాన్ని మరచి పలు వ్యసనాలకులోనై ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటున్నారని అయ్యప్ప మాలధారణ వలన స్వామి భక్తితో పాటు మాల నియమాల వలన ఆరోగ్య సంరక్షణ జరుగుతుందని అన్నారు. ఈ సంవత్సరం అయ్యప్ప మహా సంఘమం విశాఖలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఏపీ ప్రతినిధులు నల్లపనేని రామారావు,ఎం అంకయ్య ,జాష్టి ఉమామహేశ్వరరావు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

పీహెచ్సీ వైద్యాధికారిగా డాక్టర్ చంద్రిక

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : చందోలు పీహెచ్సీ వైద్యాధికారిగా డాక్టర్ ఎన్.చంద్రిక శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈమె పిట్టలవానిపాలెం ప్రభుత్వ వైద్యశాలలోగా పని చేస్తూ ప్రస్తుతం చందో లు పీహెచ్సీకి బదిలీపై వచ్చారు.ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వైద్యులు డాక్టర్ లీలా కాంత్ ఉన్నత చదువులు నిమిత్తం విజయవాడకు వెళ్లారు.ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎన్.చంద్రికను వైద్యశాల సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఘనంగా నాగుల చవితి

విశాలంధ్ర-కొల్లూరు : నాగుల చవితి పర్వదినోత్సవ వేడుకలు మండలపరిధిలోని గ్రామాలలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి అధిక సంఖ్యలో స్థానికంగా ఉన్న పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడికి పుట్టలో పాలుపోచి పూజలు నిర్వహించారు. కొల్లూరు బైపాస్ రోడ్డులోని పుట్ట వద్ద భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు.

ఇంఛార్జి ఎంపీడీఓగా నేతాజీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎంపీడీఓగా పని చేస్తున్న కె.నేతాజీ వేటపాలెం మండల ఇంఛార్జి ఎంపీడీఓగా కూడా నియమితులయ్యారు. వేటపాలెం ఎంపీడీఓగా పనిచేస్తున్న రూతమ్మ అనారోగ్య కారణంగా సెలవుపై వెళ్లడంతో ఆయన ఇంఛార్జిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.